**కథ**

# పిల్లల్లేరు- ఇల్లుంది

''అంతకూ పెళ్లి చేసుకోవడం తప్పదంటే ఆ సరోజను చేసుకుంటే బాగుంటుందేమో ఆలోచించు'' అంది మా అత్తగారు.

''సరోజనా! ఏనాటి సరోజ? ఇంకా పెళ్లి కాకుండా కూర్చొంటుందా నాకోసం? అందులోనూ సెంట్రల్ సర్వీసు'' అన్నాను నేను.

''ఎంత గవర్నమెంటు ఉద్యోగయినా అమ్మాయే కదా! ఆడపిల్లలకు పెళ్లిళ్లు కావడం ఈ కాలంలో అంత తేలికైన పనికాదు. పైగా అమ్మాయి నలుపు'' మళ్లీ నచ్చచెప్పడానికి చూసింది మా అత్తగారు.

''నీ అభిప్రాయం బాగానే వుంది. కానీ ఆవిడ ఈ పిల్లలతో నన్ను చేసుకోవడానికి అంగీకరించాలి. రెండవది తన ఉద్యోగం ఇక్కడకు మార్పించుకోవాలి. మూడు వాళ్ల వాళ్లు నాతో ఆమె పెళ్లికి అంగీకరించాలి.''

''ఎందుకు అంగీకరించరు? మొదట నుండి నువ్వు వాళ్ల కుటుంబంలో మనిషిగా తిరిగావు. వాళ్ల కష్టసుఖాలలో పాలుపంచుకున్నావు. నీ పిల్లల విషయం కూడా వాళ్లకు తెలుసు. చక్కగా మంచి రంగులో వున్నావు. ఉద్యోగ విషయం సరేసరి. ఇంతకంటే ఆమెకు మంచి సంబంధం దొరుకుతుందా? అడిగి చూస్తే మంచిది'' అని ముగించింది అత్తగారు.

నాకేమీ తోచడంలేదు. ఎంతో ఆరోగ్యంగా వుండే నా భార్య పిల్లలను కని నా మెడకు తగిలించి ఆమె సడెన్‌గా వెళ్లిపోయింది. మళ్లీ పెళ్లి చేసుకోకుండా వుండాలన్నా నాకేమంత వయసు కాలేదు. పిల్లలు మరీ పది సంవత్సరాల లోపు వున్నవాళ్లే. మా అత్తగారు మంచం మీదుండవలసిన రోగిష్టి. ఏం చేయాలి? అయినా సరోజ సమాచారం తెలిసిందేగా! ఆమెను కలసి విషయం కదిపితే ఏమంటుందో? బాగుంటుందా? అనే ఆలోచనలతో సతమతమవుతున్నా. వాళ్లదో విచిత్రమైన కథ.

★ ★ ★

హైదరాబాద్‌లో ఉండగా సరోజ వాళ్లూ మాకు ఫేమిలీ ఫ్రెండ్స్. వాళ్లు మా ఇంట్లోనూ, మేము వాళ్లింట్లోనూ స్వేచ్ఛగా తిరిగేవాళ్లం. తల్లి పోవడంతో తండ్రి పెంపకంలో పెద్దవాళ్లయి ఏవో ఉద్యోగాలు చేసుకునేవారు. తరువాత తండ్రి కూడా కాలం చేయడంతో వాళ్ల మంచిచెడ్డలు వాళ్లే చూసుకోవలసి వచ్చేది. నేను కూడా వాళ్లను ఆదుకునేవాడిని అవసరం వచ్చినప్పుడు. తెలిసిన అమ్మాయి కాబట్టి పిల్లలను బాగా చూసుకుంటుందని మా అత్తగారి ఆశ.

మేం హైదరాబాద్‌లో వుంటూ సరోజకు సంబంధాలు వెతికేవాళ్లం. స్నేహం కారణంగానైతేనేం, వాళ్లకు వేరే అంత కావలసిన వాళ్లు అక్కడ లేకపోవడం చేతనైతేనేం నా ప్రయత్నం నేను చేసేవాడిని.

మొత్తానికి నా కృషి ఫలించింది. ఒక స్నేహితుని ద్వారా ఒక పెద్దాయనను కలిసాను. ఆయనతో సరోజ విషయం, ఆమె ఉద్యోగ వివరాలు చెప్పాము. ఆయన కూడా తన కొడుకు వివాహ విషయంలో తిరుగుతున్నానని, అతను మెడికల్ కంపెనీ మేనేజరనీ, అయితే జాతకాలు కుదిరితేగానీ పెళ్లి చెయ్యననీ చెప్పారు. ఆయన కోరిక ప్రకారం సరోజ జాతకం తెచ్చి ఆయనకివ్వడం జరిగింది. వెంటనే ఆయన తన కొడుకు జాతకం దగ్గర పెట్టుకుని చూసుకుంటూ నవ్వుకుంటున్నాడు.

ఆయన నవ్వు ముఖం చూడగానే నాకు ఆశ పుట్టింది. ఏం చెబుతారా అని ఆతృతగా ఆయన ముఖంకేసి చూస్తున్నాను.

''బాబూ రాజారామ్! రెండు జాతకాలు చక్కగా కుదిరాయి. అమ్మాయిని కూడా చూడక్కర్లేదు. కానీ మావాడు అలా ఒప్పుకోడుకదా. అందుచేత తొందరలో అమ్మాయిని చూడ్డానికి ఏర్పాటు చెయ్యి'' అని సంతోషంగా చెప్పారు.

నేను ఏదో సాధించగలిగేనని ఆ రంగరాజుగారినడిగి వాళ్లబ్బాయి జాతకం తీసుకుని సరోజ వాళ్లింటికి వెళ్లి విషయం చెప్పాను. వాళ్లు కూడా నేను చెప్పిన శుభవార్త విని ఎంతో ఉత్సాహంతో మా నాన్నగారు లేకపోయినా మీరు చేస్తున్న సాయం మర్చిపోలేనని నన్ను పొగడ్డం ప్రారంభించారు. ఎంతయినా వయసు ముదిరిపోతున్న అమ్మాయికి పెళ్లి కుదరబోతుందన్న అభిప్రాయం గట్టిపడినప్పుడు ఆనందమేకదా! ఇంట్లో అంతా ఉత్సాహంగా ఉన్నారు.

ఆ రోజు పెళ్లిచూపులు. అమ్మాయిని చూడ్డానికి అబ్బాయి, తండ్రి రంగరాజుగారు, పెద్ద కూతురు విద్యాధరి వచ్చారు. అమ్మాయిని అబ్బాయి, అబ్బాయిని అమ్మాయి బాగా చూసుకున్నారు. విద్యాధరి పెళ్లికూతురుని చూసి పెదవిరిచేసింది. కాఫీ ఫలహారాలు అయ్యాయి. రెండు మూడురోజులలో నిర్ణయాలు జరుగుతాయనే అభిప్రాయంతో పెళ్లిచూపుల కార్యక్రమం ముగిసింది.

వాళ్లు వెళ్లగానే అబ్బాయి నచ్చాడా అని సరోజను నేనే అడిగాను. ఆమె సరైన సమాధానం చెప్పకుండా అక్కల వైపు చూస్తూ నసిగింది.

''ఏమీ బాగులేడండి అబ్బాయి. నలుపు, బట్టతల. ఏమో బాబు! మాకిష్టంలేదు'' అంది వాళ్ల చిన్నక్క.

''వాళ్ల వాళ్ల ఇష్టాలనుబట్టి వుంటుంది. నేనేం చెప్పలేనండీ'' అంది పెద్దక్క.

''మీ అభిప్రాయాలకేంగానీ నీకెలా ఉన్నాడు? చెప్పు సరోజా!'' అడిగాను సీరియస్‌గా.

''నాకూ నచ్చలేదండీ. మరీ నలుపు. లోతుకళ్లు'' అంటూ ఏవో పేర్లు పెట్టింది.

నాకు ఒళ్లు మండిపోయింది.

''నువ్వు మహా బాగున్నావా? నువ్వు నల్లగా లేవా? ఒకసారి అద్దంలో చూసుకో. అయినా వయస్సు ముదిరిపోతుందనేది గుర్తుంచుకుని మాట్లాడాలి'' అన్నాను నేను.

''రాజారామ్‌గారూ! తను ఎలా వున్నా తనకు వచ్చేవాడు బాగుండాలనుకునేది సహజం. అందుచేత దానికి నచ్చలేదంటే వదిలెయ్యడం మంచిది'' అంది పెద్దక్క.

''మంచి కుటుంబం. ఉద్యోగం కూడా మంచిది. మళ్లీ కావాలంటే సంబంధాలు దొరకడం కష్టం. జాతకాలు బాగా కుదిరేయన్నారు. తరువాత మీ ఇష్టం ఆలోచించుకోండి'' అని నేను కోపంగా వెళ్లిపోయాను.

★ ★ ★

ఆఫీసు నుండి వస్తూ రంగరాజుగారింటికి వెళ్లాను ఆ మర్నాడు. తండ్రీ కూతుళ్లు తర్జనభర్జనలు పడుతున్నారు.

''నాన్నా! అంతటి నల్లటి అమ్మాయిని తమ్ముడికి చెయ్యడం నాకిష్టంలేదు. వేరే సంబంధం చూడడమే మంచిది'' విద్యాధరి తండ్రి రాజారామ్‌తో అంటోంది.

''రంగులో ఏముందమ్మా! సంస్కారం, మంచి జాతకం ఉండాలమ్మా. ఈ అమ్మాయి జాతకం ప్రకారం ఇల్లు కడుతుంది. ఇటువంటి సిటీలో ఇల్లు కట్టడం అంత తేలికకాదు కదా. ఏమోయ్ రాజారామ్ ఏమంటావ్? అమ్మాయివాళ్లు ఏమన్నారు'' అన్నారు రంగరాజుగారు.

నేను ఆయనను నిరుత్సాహపరచడం ఇష్టంలేక-

''మీరొక్కసారి వాళ్లింటికి రండి. మాట్లాడదాం'' అంటూ బయలుదేరాను.


''నేనూ నీతోపాటే వస్తున్నా ఉండు బాబు'' అంటూ ఆయన నాతోనే బయలుదేరాడు ఆడపెళ్లివారింటికి.

★ ★ ★

''ఏమమ్మా! ముహూర్తాలు పెట్టుకుందామా? కట్నకానుకలు ఏదో ఫార్మాలిటీకి. అంతే. జాతకాలు బాగా కుదిరాయి'' అన్నారు రంగరాజుగారు.

''మా చెల్లికి నచ్చలేదంటూం దండీ. దానికి నచ్చ నప్పుడు మనమేం చేస్తాం'' అంది పెద్దక్క.

''బాబూ రాజారామ్! నువ్వు వాళ్లూ కలసి సరోజకు నచ్చచెప్పండి. అమ్మాయి జాతకం ప్రకారం ఇల్లు కడుతుంది. అందుకే మా విద్యాధరి అమ్మాయి నల్లగా వుందన్నా పట్టించుకోలేదు. అబ్బాయికి నా మాట వేద వాక్యం. నేను కట్నం కూడా ఆశించడంలేదు'' అంటూ రంగరాజుగారు పెళ్లికూతురు అక్కలను, నన్ను ప్రాధేయపడుతూ చెప్పారు.



ఎన్ని విధాలా చెప్పినా ఇంకోసారి ఆ పెద్దాయన వాళ్ల ఇంటి చుట్టూ తిరిగినా అదే మాట తప్పించి ఈ పెళ్లికి అంగీకరించలేదు.

అటువంటి సరోజను నేను పెళ్లి చేసుకోవాలని మా అత్తగారి సలహా అయితే రంగరాజు అప్పుడు అంత మోజుపడిన సరోజ విషయంలో నాకు రెండవ పెళ్లికి కూడా ఇష్టం కలుగలేదు. ఆమెకు పెళ్లయిందో లేదో కూడా తెలియదు. నాకు విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్లు దూరం కావడం కూడా అశ్రద్ధకు కారణం. నేను వేరొక సంబంధం చూసుకుని వివాహం చేసుకోవడం కూడా అయిపోయింది.

★ ★ ★

తరువాత కొన్ని సంవత్సరాలకు వేరే ముఖ్యమైన పని మీద హైదరాబాద్ వెళ్లడం జరిగింది. ఎలాగూ వచ్చాను కాబట్టి వాళ్ల ఆఫీసుకువెళ్లి సరోజను చూద్దాం అనిపించింది. వెళ్లాను.

నన్ను చూడగానే సరోజ బయటకు వచ్చింది.

''రండి...రండి. ఎన్నాళ్లకు మేం గుర్తొచ్చాం?'' విజిటర్స్ రూమ్‌కు తీసుకెళ్లింది.

ఇద్దరం చెరొక కుర్చీమీద కూర్చున్నాం. సరోజ జుట్టు బాగా నెరిసిపోయింది. కళ్లు బాగా నీరసం, లోతుకు పోయినట్లున్నాయి. ముఖంలో ముడతలు. నాకేదో బాధగా అనిపించింది. అయినా నేనెలా టాపిక్ ప్రారంభించాలా అని ఆలోచిస్తుండగా-

''పాపం మీ భార్య పోయిందని తెలిసింది. ఆవిడ బాగా ఆరోగ్యంగానే వుండేదిగా?'' అడిగింది సరోజ.

''అవును. ఆరోగ్యంగానే వుండేది. కానీ పోయింది. విధినెవరు తప్పించలేరు. సడెన్‌గా గుండె జబ్బు వచ్చింది'' అన్నాను.

''మరి మళ్లీ పెళ్లి చేసుకున్నారా? లేకపోతే పిల్లలతో కష్టంకదా!''

''అవును. పిల్లలతో పెళ్లి చేసుకున్నా కష్టమే. చేసుకోకపోయినా కష్టమే. నిన్ను చేసుకోమని మా అత్తగారు సలహా ఇచ్చింది.''

''మరి మీరు నాకెందుకు తెలియపర్చలేదు?''

''నీకు వ్రాసి నీచేత కాదనిపించుకుని చిన్నబుచ్చుకోడం నాకిష్టంలేదు. అయినా అదంతా అనేక సమస్యలతో కూడినది. జరిగే పనికాదు'' అన్నాను.

''మిమ్మలను చేసుకోవడానికి నేను ఎటువంటి అభ్యంతరము చెప్పేదాన్ని కాదనుకుంటా'' అంది సరోజ కళ్లు నేలవైపు అన్చి.

''నేనో దగ్గరమ్మాయిని చేసేసుకున్నా. ఆ సమస్య తీరిపోయిందిలే. అవునూ మీ ఆయన విషయం చెప్పలేదు. ఆయనేం చేస్తున్నాడు? నిన్ను బాగా చూసుకుంటాడా? పిల్లలెంతమంది?'' అని వరుసగా అడిగేసాను.

ఆమె నా చెయ్యి తన చేతిలోకి తీసుకుంది. కళ్ల వెంబడి నీళ్లు.

''పిల్లలు లేరు. ఇల్లు కట్టుకున్నాను'' అంటూ చెయ్యి వదిలింది.

''అంటే పిల్లలు పుట్టలేదా?'' నేను అడిగాను అమాయకంగా.

''పెళ్లి కాలేదు. మీరప్పుడు అన్నారుగా మంచి సంబంధం, తిరస్కరించకు అని. నన్ను చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. నాకా యోగంలేదు. మూడునెలల్లో రిటైరవుతున్నాను. అయితే ఆ రంగరాజు చెప్పినట్లు జాతకం ప్రకారం ఇల్లు కట్టుకున్నాను. అక్కడే ఒంటరిగా కాలక్షేపం'' అంటూ కళ్లు తుడుచుకుంది. ★

ఎ. వి. ఎల్. నరసింహారావు